## క్లుప్తంగా

### సచివాలయాలు, వలంటీర్లు రెండు కళ్లు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, ఎంపీటీసీ మార్త, సర్పంచ్ కమలకుమారి

**నల్లజర్ల:** ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే క్రమంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ రెండు కళ్లుగా పని చేస్తున్నాయని ఎంపీపీ బంక జయలక్ష్మి అన్నారు. వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా అనంతపల్లి-1,- 2 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నవరత్న పథకాలను పేదలకు పారదర్శకంగా అందించడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. వరుసగా మూడో ఏడాది కూడా వలంటీర్లకు అవార్డులు అందజేయడం శుభ పరిణామన్నారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన గ్రామ వలంటీర్లను ఆమె సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంగల కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి మార్త, కార్యదర్శి విజయకుమార్, నాయకులు బంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### దేవరపల్లి మండల ప్రత్యేకాధికారిగా రాధాకృష్ణ



**దేవరపల్లి:** దేవరపల్లి మండల ప్రత్యేకాధికారిగా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాధాకృష్ణ నియమితులయ్యారు. ఆయన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ప్రత్యేకాధికారిగా ఉన్న డీపీఓ ఎస్.జగదాంబ తాళ్లపూడి మండల ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు.

### 'జగనన్న ఆణిముత్యాలు' కు ఇద్దరు ఎంపిక

**గోపాలపురం:** టెన్త్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు బహుమతులు ప్రకటించారు. గోపాలపురం నియోజకవర్గ స్థాయిలో ఈ అవార్డుకు గోపాలపురం మండలంలోని జగన్నాథపురం జెడ్పీ హైస్కూల్ నుంచి పుప్పాల హర్షవర్ధిని ద్వితీయ స్థానం, రాజంపాలెం జెడ్పీ హైస్కూల్ నుంచి ముత్తన బోయిన లేఖన తృతీయ స్థానంలో నిలిచి జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైనట్టు ఎంఈఓ జి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ద్వితీయ స్థానం పొందిన విద్యార్థినికి రూ 10 వేలు, తృతీయ స్థాన పొందిన విద్యార్థినికి రూ.5 వేల నగదు బహుమతులను ఈనెల 25న అందించనున్నట్టు ఎంఈవో తెలిపారు.

### బాలికను వేధించిన ఘటనపై కేసు

**నిడదవోలు రూరల్:** బాలికను ప్రేమించమని వేధించిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని డి.ముప్పవరానికి చెందిన 16 ఏళ్ల బాలిక తణుకులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టెన్త్ పూర్తి చేసింది. ఆ బాలికను అదే గ్రామానికి చెందిన వరద శ్రీసాయి హర్ష అనే యువకుడు ప్రేమించమని వేధిస్తుండగా అతనికి తల్లిదండ్రులు కూడా సహకరిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభానీ పేర్కొన్నారు.

### మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**నిడదవోలు రూరల్:** కొడుకు ఓ బాలికను ప్రేమించాడు. భయాందోళన చెందిన తండ్రి వరద శ్రీను మనస్తాపంతో శనివారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని డి.ముప్పవరంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ తెలిపారు. వరద శ్రీను కుమారుడు శ్రీసాయి హర్ష టైల్స్ పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించాడు. తనను వేధిస్తున్నాడని శ్రీసాయి హర్షపై ఆ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కొడుకు విషయంలో ఆందోళనకు గురై తీవ్ర మనస్తాపంతో వరద శ్రీను మద్యంలో పురుగు మందు కలుపుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం శ్రీను నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై సుభానీ పేర్కొన్నారు.

# బాలల భవితకు బడిబాట

- బడి మానేసిన పిల్లల వివరాల సేకరణలో అధికారులు
- పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు
- ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వారి వివరాల నమోదు



చాగల్లులో సర్వే చేస్తున్న విద్యాశాఖ అధికారులు

**చాగల్లు:** బడిఈడు పిల్లలందరూ అందరూ బడిలో చదువు కునేందుకు వీలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా మనబడి, 'నాడు-నేడు' అనే పథకాన్ని రూపొందించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల మౌలిక వసతులను పాఠశాలల్లో ఇప్పటికే కల్పించారు. కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తీసుపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు అవసరం అయ్యే పుస్తకాలు, బ్యాగులు, షూలు, యూనిఫారాలతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని సమకూరుస్తున్నారు. అదేవిధంగా అమ్మఒడి పథకం ద్వారా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేల చొప్పున వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇక 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి బైజూస్ కంటెంట్‌తో బోధనను ప్రారంభించారు. తాజాగా విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా? లేదా అన్న అంశంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రుల మొబైల్ ఫోన్‌కు సందేశం పంపేలా చర్యలు తీసుకుంది. పాఠశాలల్లో విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన సాగిస్తున్నారు. ఇందులో భాగంగానే పాఠశాలల్లో చేరికలు పెంచేందుకు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు, చదువుతూ మధ్యలో బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో 39 ప్రభుత్వ పాఠశాలల్లోని 5 నుంచి 18 ఏళ్ల పిల్లల వివరాలను సేకరిస్తున్నారు.

**చిన్నారుల వివరాలు సేకరణ**

పేద విద్యార్థులకు చదువు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఓ.ఎస్సీ (అవుట్ ఆఫ్ దా స్కూల్ స్టూడెంట్) సర్వే చేసి బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని సంకల్పించారు. బడికి వెళ్లని పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు, పదో తరగతి ఫెయిల్ అయి ఇంట్లో ఉన్న పిల్లల వివరాలను సీఆర్పీలు ఇంటింటికీ వెళ్లి నమోదు చేస్తున్నారు. దీనిలో పిల్లల పేరు, తల్లిదండ్రుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆ వివరాలన్నింటినీ జిల్లా విద్యాశాఖ సర్వర్‌కు అనుసంధానం చేశారు. వాటి ద్వారా మండల విద్యాశాఖాధికారి పరిధిలో బడికి వెళ్లని పిల్లల వివరాలను పంపించి వారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. పదో తరగతి ఫెయిలై ఇంట్లో ఉన్న బాల బాలికలు ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా సన్నద్ధం చేస్తున్నారు.

**చాగల్లు మండలంలో ఓ.ఎస్సీ సర్వే వివరాలు ఇలా....**

చాగల్లు మండలంలో ఓ.ఎస్సీ (అవుట్ ఆఫ్ దా స్కూల్ స్టూడెంట్) సర్వే ద్వారా ఇంటింటికీ సర్వే చేసిన నేపథ్యంలో ఇప్పటివరకూ ఐదేళ్ల పైబడిన చిన్నారులు 353 మందిని గుర్తించారు. వారితో పాటు ఒకటో తరగతికి-71 మంది, మూడో తరగతికి-36 మంది, ఆరో తరగతికి 21 మంది విద్యార్థులను గుర్తించారు. వారందరికీ సమీప పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య**



ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందిస్తున్నాం. బడి మానేసిన పిల్లలు, బడిఈడు పిల్లల వివరాలు సేకరించి వారిని బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నాడు-నేడు ద్వారా చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాం. జగనన్న విద్యా కిట్లను విద్యార్థులకు అందిస్తున్నాం. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.
-వి.ఖాదర్‌బాబు, ఎంఈవో, చాగల్లు మండలం

## సమన్వయంతో ఏర్పాట్లు చూడండి

- మంత్రి తానేటి వనిత
- సీఎం జగన్ కొవ్వూరు పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



**కొవ్వూరు:** నాయకులందరూ సమన్వయంతో ముఖ్యమంత్రి కొవ్వూరు పర్యటన ఏర్పాట్ల బాధ్యతలు తీసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సూచించారు. ఈనెల 24న ముఖ్యమంత్రి కొవ్వూరు పర్యటన ఏర్పాట్లపై మంత్రి వనిత శనివారం చాగల్లు మండలం, కొవ్వూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్ర గ్రామాల వారీగా, పట్టణంలో వార్డుల వారీగా నాయకులతో చర్చించారు. జగనన్న విద్యాదీవెన కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కొవ్వూరు విచ్చేస్తున్నారన్నారు. సీఎం రోడ్ షో, సభా ఏర్పాట్లపై స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. సభకి వచ్చే పార్టీ శ్రేణులు, విద్యార్థులకు ఎక్కడా లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్‌లు మన్నే పద్మ, గంధ్రోతు అంజనీదేవి, పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ చాగల్లు మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే చంద్రబాబుకు అక్కసు

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత విమర్శ
- బాబు వ్యాఖ్యలపై కొవ్వూరులో నిరసన



కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ నాయకులు

**కొవ్వూరు:** సీఎం జగనన్న రాష్ట్రంలో 32 లక్షల మంది పేదల సొంతింటి కలను సాకారం చేస్తుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్వలేక ఆ ఇంటి స్థలం శవం పూడ్చడానికి కూడా చాలదంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలపై మంత్రి శనివారం కొవ్వూరులోని క్యాంపు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నిల మేనిఫెస్టోలో 25 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి 32 లక్షల మందికి అందించిన ఘనత జగన్‌మోహన్‌ రెడ్డిది అన్నారు. జగనన్న దయతో ఈ రోజు ప్రతి పేదవాడి సొంతింటి కల నేర వేరుతోందన్నారు. భారీ ఎత్తున భూములు కొనుగోలు చేసి లేఅవుట్స్ వేసి, పేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తుంటే భవిష్యత్తులో టీడీపీ భూస్థాపితం అవుతుందన్న భయంతో చంద్రబాబు పేదల స్థలాలను శ్మశాన వాటికతో పోలుస్తున్నారన్నారు. అమరావతిలో రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి చంద్రబాబు తెర లేపారని, రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా హైకోర్టులో అడ్డుకున్న ఘనత ఆయనదని మంత్రి వనిత ఎద్దేవా చేశారు. చంద్రబాబు వ్యాఖ్యాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు నినాదాలు చేశారు. చంద్రబాబు భేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, చాగల్లు, పట్టణ పార్టీ గౌరవాధ్యక్షులు జుట్టా ఏడుకొండలు, నగళ్లపాటి శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేయకుంటే జగన్‌కు చెడ్డ పేరు

- ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు
- తాళ్లపూడి మండల పరిషత్ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పోసిరాజు

**తాళ్లపూడి:** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో, బాధ్యతగా పనిచేయకుంటే ఆ మచ్చ ప్రత్యక్షంగా జగనన్న పాలనపై పడుతుందని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు హెచ్చరించారు. తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం పోసిరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఎంపీడీఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 24న కొవ్వూరులో నిర్వహించే ముఖ్యమంత్రి బహిరంగ సభ విజయవంతానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. రావూరుపాడు పేదలకు పెద్దేవం శివార్లలో ఇళ్ల స్థలాలు కేటాయించడంపై ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు అభ్యంతరం తెలిపారు. అనువుగా ఉన్న స్థలాన్ని కొనుగోలు చేయాలని కోరారు. గ్రామంలో స్థలం సమస్య ఉందని ఎంపీడీవో బదులిచ్చారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సబ్సిడీపై దాణా అందిస్తున్నట్టు డాక్టర్ బాలాజీ శ్రీనివాస్ చెప్పారు. ఎంఈఓ కె.వివేకానంద మాట్లాడుతూ మండలానికి జగనన్న విద్యాకానుక కిట్లు అందాయని, పుస్తకాలు సహా పంపిణీ చేస్తామని తెలిపారు.

**మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి**

సమావేశంలో ఏవో జి.రుచిత మాట్లాడుతుండగా ధాన్యం నిబంధనల మేరకు ఉన్నప్పటికీ నూకల పేరుతో మిల్లర్లు కొనుగోలు సమయంలో రైతులను ఇబ్బంది పెడుతున్నారని తాడిపూడి సర్పంచ్ నామా శ్రీనివాస్, రావూరుపాడు ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు ఆరోపించారు. మిషన్ వాత్సల్య ద్వారా అనాథ పిల్లలకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి తెలిపారు. సచివాలయాలు, రైతు భరోసా వంటి ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు బిల్స్ త్వరలో వస్తాయని ఎంపీడీఓ రాజశేఖర్ తెలిపారు. తహసీల్దార్ రాధిక మాట్లాడుతూ భూముల రీ సర్వే జరుగుతోందని ఈ విషయంలో సమస్యలుంటే చెప్పవచ్చన్నారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, తాళ్లపూడి పీహెచ్‌సీ డాక్టర్ రమణనాయక్ , గజ్జరం ఎంపీటీసీ సభ్యుడు గుంటి చిన్నబ్బాయి తదితరులు కూడా మాట్లాడారు. సమావేశంలో వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులులు, అధికారులు, పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గోగులమ్మ జాతర



గోగులమ్మ వారు



ఊనగట్లలోని అమ్మవారి పూరిపాక వద్ద మంత్రి వనిత

**చాగల్లు:** మండలంలోని ఊనగట్ల గ్రామదేవత గోగులమ్మ వారి జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శనివారం నడివీధిలోని అమ్మవారి పూరిపాక వద్ద అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుదీపాలంకరణ, ప్రధాన ద్వారాలు స్వాగతించాయి. డప్పు వాయిద్యాలు, ఆసాదుల నృత్యాలు, గరగలతో గ్రామోత్సవం సందడిగా సాగింది. గ్రామ అడపడుచులు అమ్మవారికి వస్త్రాలు సమర్పించి పానకం, చలివిడితో పూజలు చేశారు. జాతర సందర్భంగా బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో పండగ వాతవారణం నెలకొంది.

**దర్శించుకున్న హోం మంత్రి తానేటి వనిత**

గోగులమ్మ వారిని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం దర్శించుకున్నారు. ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు పూలమాలతో ఘన స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు. అమ్మవారికి పూరిపాక వద్ద మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడం హర్షణీయం అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్యతో పాటు పలువురు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభం
- రూ.14.లక్షలతో నిర్మించిన పరమేశు బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్



బాస్కెట్ బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**దేవరపల్లి:** గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టును శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. రూ.14 లక్షల వ్యయంతో పరమేశు బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఈ బాస్కెట్ బాల్ కోర్టు నిర్మించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడారు. బాస్కెట్ బాల్ కోర్టు నిర్మించిన పరమేశు బయోటెక్ యాజమాన్యం ఉపేంద్రారెడ్డి, ఆనంద్ స్వరూప్‌లను అభినందించారు. దేవరపల్లిలో జాతీయ స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తే తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియం నిర్మాణం గురించి మంత్రి రోజాకు చెప్తానని, త్వరలో నిధులు మంజూరవుతాయని తలారి అన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఎం మనోహర్ మాట్లాడుతూ ఈ ఏడాది 'ఆడదాం..ఆంధ్రా క్రీడలను' అనే కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి జిల్లాలో ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్యం గల క్రీడాకారులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, బాస్కెట్‌బాల్ కోర్టు దాత తేతలి ఉపేంద్రారెడ్డి కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, పరమేశు బయోటెక్ ఎండీ ఆనంద్ స్వరూప్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గన్నమని చక్రవర్తి, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి మోహన్‌దాస్, శాఫ్ మాజీ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్, పలువురు స్పోర్ట్స్ అధికారులు, పీడీలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జెడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థులు

**దేవరపల్లి:** స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో 1983-84 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం జరిగింది. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులతో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. అనంతరం పూర్వ గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు.

### 'వెల్లువ' కేంద్రాల్లో పాల సేకరణ పెంచాలి



వీఓల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభాషిణి

- డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభాషిణి
- ఐదు మండలాల వీవోలతో సమావేశం

**దేవరపల్లి:** జగనన్న పాలవెల్లువ కేంద్రాల్లో పాల సేకరణ పెంచాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సుభాషిణి మహిళా సంఘాలకు సూచించారు. కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల విలేజ్ ఆర్గనైజర్ల సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో పీడీ సుభాషిణి మాట్లాడుతూ ఐదు మండలాల్లో పాలసేకరణ తగ్గిందన్నారు. ప్రస్తుతం రోజుకు రెండు నుంచి మూడు వేల లీటర్ల పాల సేకరణ మాత్రమే జరుగుతుందన్నారు. దీనిని కనీసం ఐదు వేల లీటర్లకు పెంచాలని సూచించారు. ఐదు మండలాల్లో 5,553 మంది రైతులు సభ్యులుగా ఉన్నాయని, ఒక్కో సభ్యుడు రోజుకు కనీసం ఒక లీటరు పాలు అమూల్ కేంద్రాలకు పోయాలన్నారు. పాలు పోసిన 10 రోజుల్లో సొమ్ము జమ చేస్తున్నట్టు ఆమె చెప్పారు. నల్లజర్ల సొసైటీ వద్ద త్వరలో మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్నట్టు ఆమె చెప్పారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాధాకృష్ణ, జాయింట్ డైరెక్టర్ ఎస్.సత్యగోవింద్, ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఏపీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ఎర్ర చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

**నల్లజర్ల:** స్థానిక ఎర్ర చెరువులో సుబ్రహ్మణ్యస్వామి గుడి వెనుక గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని శనివారం సాయంత్రం నల్లజర్ల పోలీసులు కనుగొన్నారు. సుమారు 50 ఏళ్ల వయసున్న మహిళ నలుపు రంగు జాకెట్టు, నలుపు పసుపు రంగు గల చీర ధరించి ఉంది. ఆమె శుక్రవారం ఉదయం బహిర్భూమికని వెళ్లి కాలు జారి చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహం ఉబ్బి ఉంది. శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. ఎస్సై నరసింహమూర్తి, పోలీసులు, వీఆర్వో లక్ష్మణమూర్తి మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి వివరాలు ఆరా తీస్తున్నారు.

### వలంటీర్లకు పురస్కారాలు

**కొవ్వూరు:** సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలు మరువ లేనివని ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు పేర్కొన్నారు. పెనకనమెట్టలో పంచాయతీ కార్యదర్శి శనివారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులు అందజేశారు. శాలువాలు కప్పి జ్ఞాపిక, బ్యాడ్జి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

### డ్రగ్స్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ సగ్గొండ వాసుల నిరసన

**గోపాలపురం:** సగ్గొండ పంచాయతీ పరిధిలోని గోవపరం వద్ద తలపెట్టిన డ్రగ్స్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని కోరుతూ ఆ గ్రామస్తులు శనివారం సగ్గొండ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామం చుట్టూ ఉన్న ఫ్యాక్టరీల వల్ల వచ్చే నీరు, వాయు కాలుష్యంతో అనేక రోగాల బారిన పడుతున్నామని వారు పేర్కొన్నారు. దీనిపై సగ్గొండ సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబును వివరణ కోరగా గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. కొందరు తమ రాజకీయ స్వార్థం కోసం అమాయకులను రెచ్చగొడుతున్నారన్నారు. కలెక్టర్ కె.మాధవీలత, కొవ్వూరు ఆర్డీఓ ఎస్. మల్లిబాబు సూచనల మేరకు పంచాయతీ ద్వారా తాత్కాలిక తీర్మానం చేశామన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో యాజమాన్యం గ్రామంలో బహిరంగ చర్చ ఏర్పాటు చేస్తారని ఫ్యాక్టరీ వల్ల అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు సర్పంచ్ తెలిపారు.

### విద్యుత్తు పనిముట్ల వాడకంలో జాగ్రత్తలు అవసరం

**కొవ్వూరు:** ఫ్యాక్టరీల్లో విద్యుత్తు ఉపకరణాల ఉపయోగించే సమయంలో సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని భద్రతాధికారి కేవీవీ సత్యనారాయణ మూర్తి సూచించారు. ఎలక్ట్రికల్ ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఆంధ్రా షుగర్స్ కర్మగారంలో శనివారం కార్మికులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కర్మాగారంలో విద్యుత్తు ఆధారిత యంత్రాల వినియోగం, పరికరాలు, సామగ్రి వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమగ్రంగా వివరించారు. ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్ సీహెచ్ సుఖ మహర్షి పాల్గొన్నారు.

## శివారు ప్రాంత వాసులకూ మౌలిక వసతులు

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బసివిరెడ్డిపేటలో బోరుకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ ఆదినారాయణ

**నిడదవోలు:** పట్టణ శివారు ప్రాంతాల వాసులకు కూడా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చెప్పారు. పట్టణంలోని బసివిరెడ్డిపేటలో శిథిలావస్థకు చేరిన బోర్‌వెల్ స్థానంలో రూ.6.60 లక్షల వ్యయంతో కొత్త బోర్‌వెల్ ఏర్పాటుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే రూ.6.40 లక్షల వ్యయంతో బసివిరెడ్డిపేటలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే ఉన్న రెండు కాలువ రేవుల నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. అలాగే రూ.12.92 లక్షల వ్యయంతో పట్టణంలోని 24, 25 వార్డులలో సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిరెడ్డి శ్రీనివాస్, మేడపాటి లక్ష్మీనారాయణరెడ్డి, అడపా రాజు, తేలేటి కోటేశ్వరరావు, మున్సిపల్ డీఈఈ మాధవీలత, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మండలానికి మూడు డ్రోన్లు

- 40 శాతం రాయితీపై సరఫరా చేయనున్న ప్రభుత్వం
- పంటలకు ఇక సులభంగా పురుగు మందుల పిచికారీ

**నల్లజర్ల:** వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. వాటి సాయంతో సులభంగా, సమర్థవంతంగా అన్ని రకాల పంటలకూ పురుగు మందులను పిచికారీ చేయవచ్చు. అందుకే రైతులు ఇప్పుడు డ్రోన్ల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు బృందాలకు రాయితీపై డ్రోన్లు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు మండల వ్యవసాయాధికారి (ఏవో) కె.కమల్‌రాజ్ శనివారం తెలిపారు. వాటిని 40 శాతం రాయితీపై కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ల ద్వారా రైతు బృందాలకు అందిస్తారు.డ్రోన్ సగటు ధర రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు. 40 శాతం రాయితీపై 50 శాతం రుణ సహాయంతో ఈ డ్రోన్లను అందిస్తారు. నల్లజర్ల మండలంలో ఆర్బీకేల ద్వారా ఎంపిక చేసిన మూడు రైతు బృందాలకు రాయితీపై మూడు డ్రోన్లు అందిస్తారన్నారు. ఎంపిక చేసిన బృందాల్లో ఒకరిని డ్రోన్ వినియోగ శిక్షణకు పంపిస్తారని తెలిపారు. గుంటూరు లాఫాంలో 12 రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఏవో కమల్‌రాజ్ తెలిపారు. ఆసక్తి గల రైతులు రాయితీ డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో సూచించారు.

**30 శాతం పురుగు మందు ఆదా..**

డ్రోన్ల ద్వారా పంటలకు పురుగు మందుల పిచికారీ వేగంగా, సులభంగా పూర్తవుతుంది. ఎకరా విస్తీర్ణంలో పురుగు మందు పిచికారీకి కేవలం 8 నిమిషాల సమ యం ప డుతుంది. సాధారణ పిచికారీతో పోలితే 30 శాతం పురుగుమందు ఆదా అవుతుంది. నేలలో తేమ ఎక్కువగా ఉన్నా, వాతావరణం ప్రతికూలంగా ఉన్నా డ్రోన్‌తో పురుగుమందు పిచికారీకి ఇబ్బంది ఉండదు.